ఉద్యాన పంటల సాగుపై అవగాహన

జహీరాబాద్, ఫిబ్రవరి 6: ఉద్యాన పంటల సాగు, నర్సరీల్లో మొక్కల పెంపకంపై క్షేత్ర స్థాయిలో పర్యటించి అవగాహన పెంచుకోవాలని జహీరాబాద్ ఏఈవో ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం రంజోల్‌లో ఉద్యాన పంటల సాగు, నర్సరీ మొక్కల పెంపకంపై రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థినులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. నర్సరీలో టమాట, మిర్చి మొక్కల పెంపకంపై విద్యార్థినులకు వివరించారు. మొక్కలు పెంచేందుకు సేంద్రియ ఎరువులు, విత్తనాలు వేసే విధానం, నీరు అందించే పద్ధతిని తెలియజేశారు. నర్సరీలో పెంచే మొక్కలు 25రోజుల్లో నాటేందుకు సిద్ధంగా ఉంటాయన్నారు. కొత్త పద్ధతిలో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, అధికశాతం రైతులు నర్సరీలో పెంచిన మొక్కలు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వేసి పెంచడంతో మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నర్సరీలో విత్తనాలు వేసే విధానంపై విద్యార్థినులకు వివరిస్తున్న ఏఈవో ప్రదీప్‌కుమార్

కంపుకొడుతున్న కేతకీ పరిసరాలు

ఝరాసంగం, ఫిబ్రవరి 6: ఝరాసంగంలోని కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ పరిసరాలు కంపుకొడుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులు ముక్కుపట్టుకుని ఆలయంలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆలయానికి నిత్యం తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారి దర్శనానికి వస్తుంటారు. ఆలయానికి వచ్చి 10నిమిషాలు కూడా స్వామివారి సన్నిధానంలో ఉండలేక పోతున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఆలయ హుండీ లెక్కింపుతోనే సరిపెట్టుకుంటున్నారని, మిగతా సమయంలో ఆలయానికి వచ్చిన దాఖలాలు లేవంటున్నారు. అధికారులు కేతకీ ఆలయాన్ని సందర్శించి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసి, దైవదర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు. దేవాదాయశాఖ అధికారులు స్పందించి కేతకీ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆలయానికి రెగ్యులర్ కార్యనిర్వాహణ అధికారిని నియమిస్తే ఆలయ అభివృద్ధికి దోహదపడుతుందని భక్తులు కోరుతున్నారు.

కేతకీ ఆలయ పరిసర ప్రాంతంలో కంపుకొడుతున్న వాల్రాధి వాగు

పాత పంటలను కాపాడుకోవాలి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 6: ప్రకృతిని కాపాడుతూ, పోషకాహార విలువలను అందించే పాత పంటలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, పాత పంటల జాతర కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శంశోల్లాపూర్‌లో డీడీఎస్ ఆధ్వర్యంలో 24వ పాతపంటల జాతరను నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ పాతపంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటల్లో అనేక పోషకాలు ఉంటాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదన్నారు. అనంతరం డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, మహిళల కోలాటం, చిటికెల రామాయణం, ఆటపాటలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పాతపంటల విత్తనాలతో కూడిన ఎడ్లబండ్లతో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ మీనాక్షి, నాయకులు బాబుపాటిల్, డీడీఎస్ లీగర్ కోఆర్డినేటర్ చుక్కమ్మ, డీడీఎస్ సిబ్బంది నర్సమ్మ, మంజుల, నర్సమ్మ, కమలమ్మ, విజయలక్ష్మి, నాగమ్మ, సురేశ్, పూలమ్మ, ఆయా గ్రామాల మహిళా సంఘం రైతులు పాల్గొన్నారు.

శంశోల్లాపూర్‌లో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, డీడీఎస్ మహిళలు

టోల్‌ప్లాజా సిబ్బంది రక్తదానం

చౌటకూర్, ఫిబ్రవరి 6: మండలంలోని తాడ్దానిపల్లి శివారులోని సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజ్ అండ్ దవాఖాన ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. అనంతరం సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ఎన్‌హెచ్ ఏఐ రెసిడెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, అశోక కంపెనీ ప్రాజెక్టు మేనేజర్లు బొబడే, మేవాలాల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రక్తదాతలను టోల్‌ప్లాజా మేనేజర్ శ్రీకాంత్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. రక్తదానం చేసి ప్రాణదాతలు గా నిలువాలని ఎన్‌హెచ్ఏఐ రెసిడెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి సూచించారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వ్యక్తులను కాపాడటమే కాకుండా మనకు కూడా ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు.

రక్తదానం చేస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

పింఛన్ కోసం మహిళల పడిగాపులు

బొల్లారం, ఫిబ్రవరి 6: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ కోసం దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు పడరానిపాట్లు పడుతున్నారు. రోజూ ఉదయాన్నే 5గంటలకు పోస్టాఫీస్ వద్దకు చేరుకొని సాయంత్రం 5 గంటల వరకు పింఛన్‌దారులు ఎండ ను సైతం లెక్క చేయకుండా పడిగాపులు పడుతున్నారు. వారిని గమనించిన స్థానిక బీఆర్ఎస్ యువత నాయకులు, సంఘ సేవకుడు ఆనంద్‌కృష్ణారెడ్డి పింఛన్‌దారులకు సమయానికి పింఛన్ అందించాలని మున్సిపల్ కమిషనర్, పోస్టాఫీస్ అధికారులను విజ్ఞప్తి చేశారు. సకాలంలో పెన్షన్‌దారులకు వారి అకౌంట్‌లోకి డబ్బులు వచ్చేలా కలెక్టర్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

పింఛన్ కోసం పోస్టాఫీస్ వద్ద పడిగాపులు పడుతున్న మహిళలు

భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- రాజీవ్‌పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలి
- వందశాతం పన్ను వసూలు కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 : జిల్లాలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఓల్డేజ్ హోమ్స్, బాలసదన్ భవనాలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ పోషణతో ఉన్న (సామ్, మామ్) పిల్లలు సాదారాణ స్థితికి వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అందుకు సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలతో పాటు మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి మహిళాప్రాంగణంలో చేపడుతున్న ఓల్డేజ్‌హోమ్స్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతగా ఉండాలని స్పష్టం చేశారు. ఓల్డేజ్‌హోమ్స్‌కు సంబంధించి అవసరమైన ఫర్నిచర్ కోసం ప్రతిపాదనలు అందజేయాలని సంబంధిత ఈఈకి సూచించారు. నారాయణఖేడ్ బాల సదన్‌కు సంబంధించి ప్రతిపాదనలు అందజేయాలని, సంగారెడ్డి బాలసదన్ నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని డీడబ్ల్యూవోకు సూచించారు. ప్రీ స్కూల్ విద్య ను టైం టేబుల్ మేరకు బోధించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీడబ్ల్యూ వో సంధ్యారాణి, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సీడీపీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6: మున్సిపాలిటీలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంగారెడ్డి మున్సిపల్ అధికారులతో మున్సిపాలిటీలో చేపట్టిన పనుల పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూముల చుట్టూ రెండు వరుసల్లో మొక్కలు నాటాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థల వద్ద స్థలాలను గుర్తించి ప్లాంటేషన్ చేయాలని సూచించారు. పురపాలికలోని అన్ని ప్రధాన రహదారులకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని, 6ఫీట్ల మొక్కలు నాటాలని సూచించారు. రాజీవ్‌పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీలో వందశాతం పన్ను వసూళ్లు జరగాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ సుజాత అధికారులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 6: పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ 113లో రూ.కోటి 60లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బండ్లగూడ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించేందుకు శంకుస్థాపనలు, పూజలు చేశారు. అనంతరం శ్మశానవాటికలో కార్పొరేటర్ మెట్టుకుమార్ సౌజన్యంతో నిర్మిస్తున్న దహన వాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్లలో బండ్లగూడ దశను మార్చామన్నారు. అంచలంచెలుగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వ నిధులు సరిపోనిపక్షంలో సొంత నిధులతో పనులు పూర్తి చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత రాకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, మాజీ కార్పొరేటర్ సఫనాదేవ్, గోపాల్, చంద్రశేఖర్, ధనరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



నీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 6: తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారతీనగర్ డివిజన్‌లోని మ్యాక్‌సొసైటీ, హెచ్ఐజీ కాలనీల్లో పూర్తయిన తాగునీటి పైపులైన్‌ను కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీనగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో తాగునీటి సమస్యలు ఉండడంతో మిషన్‌భగీరథలో భాగంగా నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను మంజూరు చేయించి పూర్తి చేశామన్నారు. మ్యాక్‌సొసైటీ, హెచ్ఐజీ, ఎంఐజీ కాలనీల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, పరమేశ్, సత్యనారాయణ, పాపయ్యాదవ్ పాల్గొన్నారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 6: టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో పటాన్‌చెరు, రామచంద్రాపురం, తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలు, ప్రైవేట్ పాఠశాలల పదోతరగతి విద్యార్థులకు జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ నిధులతో ప్రత్యేక మోటివేషన్ క్లాసులు, పరీక్షా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో అత్యంత కీలకం పదోతరగతి అన్నారు. మీ తల్లిదండ్రులు శ్రమను గుర్తించి పదోతరగతిలో టాప్ మార్కులతో పాస్ కావాలని కోరారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వీరేందర్, డాక్టర్ పూర్ణకృష్ణ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పీపీ రాథోడ్, ఎంపీ పీ సుష్మావేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందజేసిన స్టడీ మెటీరియల్‌తో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

తాగునీటి పైపులైన్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

జహీరాబాద్, ఫిబ్రవరి 6: రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని జహీరాబాద్ పట్టణ సీఐరవి తెలిపారు. మంగళవారం జహీరాబాద్ సర్కిల్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, చట్టాలను ఉల్లంగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూతగాదాల్లో తలదూర్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ ఉపయోగిస్తామన్నారు. ఎవరికైనా భూతగాదాలు ఉన్నచో పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించాలన్నారు. భూతగదాల పరిష్కారం కోసం రౌడీ షీటర్లును సంప్రదిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యార్థుల స్వయం పాలన

హత్నూర, ఫిబ్రవరి 6: హత్నూరలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా అపర్ణ, డీఈవోగా ఇందు, ఎస్‌వోగా అశ్విని, జీసీడీవోగా శిరీష, ఎంఈవోగా భవానితోపాటు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

సదాశివపేట, ఫిబ్రవరి 6: ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆశవర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆత్మకూర్ పీహెచ్‌సీలో సమ్మె నోటీసు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ నాయకులు యశోద, మాధవి, శశికళ, శోభారాణి, బాలమణి, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పెద్దపీట

- డీఎస్పీ రమేశ్‌కుమార్
- మహిళా చట్టాలపై విద్యార్థినులకు అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రమేశ్‌కుమార్

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 6: మహిళల కోసం అనేక రక్షణ చట్టాలు ఉన్నాయని డీఎస్పీ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. భేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మాహిళా సాధికారత కేంద్రం, తారా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం తారా ప్రభుత్వ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ పోక్సో చట్టాలు, మహిళలు, బాలికలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు.

ఆయా చట్టాల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లపై విద్యార్థినులకు అవగాహన పెంపొందించారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. బాలికల కోసం ఏర్పాటు చేసిన షీటీమ్‌లు బాగా పని చేస్తున్నాయని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను షీ టీమ్ కు తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం భేటీ బచావో-బేటీ పడావో వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, మహిళా ఎస్ఐ నాగలక్ష్మి, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, జీఎస్ విశాల కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, శివదీప్తి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్‌తో అవస్థలు

కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేస్తున్న గంగోజిపేట గ్రామస్తులు

చౌటకూర్, ఫిబ్రవరి 6: సంగారెడ్డి ప్రధాన దవాఖాన చెత్తా చెదారాన్ని చౌటకూర్ మండలం గంగోజిపేట శివారులో డంప్ చేయడం వల్ల గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై కలెక్టర్ వల్లూరు క్రాంతికి మంగళవారం ఫిర్యాదు చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానలో రోగులకు వినియోగించిన సిరంజీలు, నిడిల్స్, గ్లూకోజ్ బా టిల్స్, పైపులు, సిరప్ బాటిల్స్ తదితర చెత్తను లారీల్లో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారని, పలువురు దళిత రైతులకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూముల్లో చెత్తను పారబోస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దవాఖానలోని చెత్తను సంగారెడ్డి మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది సేకరించాల్సి ఉండగా, సంబంధిత శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సుదూర ప్రాంతంలోని గంగోజిపేట శివారులో పారబోయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పాలాల పరిశీలన

అందోల్, ఫిబ్రవరి 6: వరిలో కాండం తొలుచు పురుగుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత సూచించారు. మంగళవారం మండలంలోని చందంపేట్, అల్మాయిపేట్ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగిలో పంటకు ఎక్కువగా కాండం తొలుచుపురుగు, రేకు పురుగులు ఆశిస్తున్నాయన్నారు. పురుగుల నివారణకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు.

పంటను పరిశీలిస్తున్న అధికారులు

నేడు గ్రామసభలు

కోహీర్, ఫిబ్రవరి 6 : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో సుజాతనాయక్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. ప్రత్యేకాధికారులతో కలిసి గ్రామసభలు నిర్వహించడంతో పాటు 14వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు కలిసి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ సమావేశం

జహీరాబాద్, ఫిబ్రవరి 6: మొగుడంపల్లి ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11:30గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో మహేశ్ తెలిపారు. ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

కోహీర్, ఫిబ్రవరి 6: కోహీర్ పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సుజాతనాయక్ తెలిపారు. ఎంపీపీ మాధవి అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

అక్రమ నిర్మాణాల తొలిగింపు

సదాశివపేట, ఫిబ్రవరి 6: పట్టణంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలిగించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దాపూర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా నిర్మించిన దుకాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యాపారులను పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి జేసీబీ తో అక్రమంగా నిర్మించిన దుకాణాలను తొలిగించామన్నారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

కబడ్డీ జట్లు ఎంపిక

పటాన్‌చెరు, ఫిబ్రవరి 6: సంగారెడ్డి జిల్లా కబడ్డీ బాల,బాలికల జట్ల ఎంపికను గురువారం నిర్వహిస్తామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ముక్తార్ జానీ, ప్రధానకార్యదర్శి అనంతరెడ్డి తెలిపారు. ఎంపికకు 16 ఏండ్లలోపున్న బాల,బాలికలు హాజరవ్వాలన్నారు. బరువు 55కేజీల లోపుండాలన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఎంపికలు ఉంటాయన్నారు. 8వ తేదీన ఉదయం 10గంటలకు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డులతో రావాలని సూచించారు. నిబంధనల మేరకు ఎంపికలుంటాయన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 16,17,18,19న సూర్యాపేట జిల్లాలో జరిగే 33వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాలన్నారు. వివరాలకు 9666513305, 9553755143ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి స్పెషల్‌డ్రైవ్

న్యాల్‌కల్/హత్నూర/పుల్కల్/కల్హేర్, ఫిబ్రవరి 6 : హత్నూర, పుల్కల్, కల్హేర్, న్యాల్‌కల్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో బుధవారం నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ఉంటాయని ఎంపీడీవోలు పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రారంభించనున్న పారిశుధ్య కార్యక్రమాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని అధికారులు తెలిపారు. అందులోభాగంగా గ్రామాల్లో చెత్తసేకరణతోపాటు,పారిశుధ్యం, మురుగుకాలువలు, రోడ్లు శుభ్రత తదితర కార్యక్రమాలు చేపడుతామన్నారు.

కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

అందోల్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మంగళవారం జోగిపేటలో మాట్లాడుతూ ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్నాలన్నారు. ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేపట్టారు. నిత్యావసరాల ధరలు తగ్గించి ఉపాధిహామీ పనులను రెండువందల రోజులకు పెంచాలని, కనీస వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళ హత్య

రాయికోడ్, ఫిబ్రవరి 6: మండలంలోని సీరూర్ శివారులో మహిళ శవం లభ్యమైనట్లు జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలు దర్జీ మల్లేశ్వరి(42) సంగారెడ్డి మండలంలోని పసల్‌వాది గ్రామంలో ఐదేండ్లుగా మతిస్థిమితం సరిగాలేక ఇంట్లో వాళ్లను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఆమె ఇబ్బందులు భరించలేక భర్త, పెద్దకొడుకు ఇద్దరు కలిసి గత నెల 28న ఆమె పడుకున్న సమయంలో గొంతు నులిమి చంపేశారు. అనంతరం ఎవరికి